క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

నూజివీడు: మండలంలోని పలు గ్రామాల్లో పూర్తయిన, చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొననున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటలకు బోర్వంచ, 10.30 గంటలకు పాతరావిచర్ల, 11 గంటలకు పోతురెడ్డిపల్లి, 12 గంటలకు ముక్కొల్లుపాడు, 12.30 గంటలకు తూర్పుదిగవల్లి, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఎంఎన్‌పాలెం, 4.30 గంటలకు దేవరగుంట, 5 గంటలకు తుక్కులూరులో సిమెంట్ రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని నాయకులు కోరారు.

రోడ్డు భద్రత చర్యలపై అవగాహన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యార్థులు రహదారి భద్రత పాటించాలని వీడూ రోడ్డు సేఫ్టీ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ వాసు అన్నారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్లో వీడూ సంస్థ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సేఫ్ సైక్లింగ్ ప్రాక్టికల్‌గా చూపించారు. ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కే సమయంలో చేతి సైగలతో మన ప్రయాణ చర్యలు ఇతర వాహనదారులకు తెలియజేయడం ద్వారా ప్రమాదాల భారినుంచి బయట పడొచ్చన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు హెల్మెట్ వాడకం తెలియజేశారు. మైలవరం డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జమలయ్య, పాఠశాల కరస్పాండెంట్ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి

జి.కొండూరు: పురుగుమందుల వినియోగం క్రమంగా తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపినప్పుడే ఆరోగ్యకరమైన అధిక దిగుబడులను సాధించేందుకు వీలు కలుగుతుందని జిల్లా రిసోర్స్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ మోనీషా అన్నారు. మండల పరిధి కుంటముక్కల గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారుమడులకు ముందు విత్తన శుద్ధి, పురుగు మందుల పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

మెరైన్ ఇంజినీరింగ్‌తో ఉద్యోగావకాశాలు



తిరువూరు: నావికాదళంలో ఉద్యోగావకాశాలు అపారంగా ఉన్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సింగపూర్ నావికాదళ ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ కెప్టెన్ రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సర విద్యార్థులకు మెరైన్ ఇంజినీరింగ్, మర్చంట్ నావీ ఉద్యోగాలపై నైపుణ్య శిక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మెరైన్ ఇంజినీర్‌గా ఉపాధి అవకాశాలు, ఉద్యోగ బాధ్యతలను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, టీపీవో ఎంహెచ్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ

ఆగిరిపల్లి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సామాజిక బాధ్యతగా గుర్తుంచుకోవాలని ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. శుక్రవారం ఆగిరిపల్లిలో మహిళలకు, నిరక్షరాస్యులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు బొల్లినేని ప్రసాద్, సంగమయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ



ముసునూరు: ముసునూరులో చేపట్టిన ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి మేట్లు, కూలీల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలంతా ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకుని, 100 రోజులు పని చేయాలని, మస్టర్ రిజిస్టర్లో కూలీలు సంతకాలు చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏపీఓ రోజీలీల, ఈ.సి జయప్రసాద్, ఉపాధిహామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

సీసీ కెమేరాల పర్యవేక్షణ



నోటీసు బోర్డులో తమ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కావడంతో తొలి రోజున విద్యార్థులందరూ అర గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ సబ్జెక్టుల పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారు. ఐదు పరీక్ష కేంద్రాల్లో కలిపి 1,621 మంది విద్యార్థులకు 1,544 మంది హాజరు కాగా, 77మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 411 మందికి 29 మంది గైర్హాజరవగా 382 మంది, సెయింట్ ఆన్స్ కళాశాలలో 271 మందికి 13 మంది గైర్హాజరవ్వగా 258 మంది, శ్రీ శారద కళాశాలలో 360 మందికి 10మంది గైర్హాజరవగా 350 మంది, శ్రీ వాగ్దేవి కళాశాలలో 325 మందికి 11మంది గైర్హాజరవ్వగా 314 మంది, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 254 మందికి 14 మంది గైర్హాజరవగా 240 మంది పరీక్షకు హాజరయ్యారు. అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతితో పాటు, సరిపడా బెంచీలు ఏర్పాటు చేశారు. వైద్యచికిత్స అందించేందుకు ప్రతి కేంద్రం వద్ద ఏఎన్ఎంలను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను అమలు చేశామని తహసీల్దారు ఏవీ శాస్త్రి తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా దుర్గాప్రసాద్, టీ విజయ, ఉమాదేవి, సీహెచ్ జాన్, చంద్రశేఖర్‌శర్మ వ్యవహరించారు.

మైలవరం: స్థానికంగా ఉన్న మూడు కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. గేటు వద్ద నుంచి జూనియర్ కళాశాల సిబ్బంది హాల్‌టికెట్లను పరిశీలించి విద్యార్థులను లోనికి అనుమతించారు. మైలవరం వీవీఆర్ జూనియర్ కళాశాలకు సంబంధించి 123 మంది విద్యార్థులకు ఆరుగురు గైర్హాజరు కాగా 117 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 92 మందికి 87 మంది హాజరయ్యారు. లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలకు చెందిన 141 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరు కాగా 139 మంది హాజరయ్యారు. ఎస్వీఆర్జీ ఎన్నార్ జూనియర్ కళాశాలకు సంబందిచి 146 మందికి ఇద్దరు గైర్హాజరు కాగా 144 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, వైద్య సదుపాయం, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

తిరువూరు: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం తిరువూరులో ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీ సబ్జెక్టులతో పాటు ఒకేషనల్ జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్ష జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకుల కళాశాల, శ్రీనిధి, నాగార్జున జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలకు 1,117 మంది విద్యార్థులను కేటాయించగా, 36 మంది గైర్హాజరయ్యారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు కల్పించారు.

విస్సన్నపేట: స్థానిక డీకేఎస్పీ (సిద్ధార్థ), వికాస్, శ్రీశ్రీ కేఎమ్మార్ అండ్ ఎమ్మెస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షకు 1,617 మంది విద్యార్థులు హాజరు కాగా 55 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.

ఆగిరిపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షకు 82 విద్యార్థులకు 75 మంది హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

మేనిఫెస్టో అమలులో నిబద్ధతగల సీఎం జగన్

ఎంపీ కేశినేని నాని



వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని నాని, సర్నాల తిరుపతిరావు

మైలవరం: మేనిఫెస్టో అమలులో నిబద్ధతగల ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. మైలవరం డౌన్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని శుక్రవారం ఎంపీ కేశినేని శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసినేని మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం భారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు.నూతన కార్యాలయ ప్రారంభోత్సవం కూడా కార్యక్రమం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి విషయంలో ఎటువంటి మార్పు ఉండదని, కార్యకర్తలు ఆందోళనకు గురకావాల్సిన పనిలేదన్నారు. మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు స్వచ్ఛమైన వ్యక్తి అని, మచ్చ లేని తెల్లకాగితం వంటి వాడన్నారు. ఒక సామాన్య వ్యక్తికి నియోజకవర్గ ఇన్‌చార్జి స్థాయిని కల్పించడం ముఖ్యమంత్రి జగన్‌కే చెల్లిందని, గడప గడపకు తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాల్సిందిగా పార్టీ అధిష్టానం చెప్పిందన్నారు. పార్టీలు మారే వారిని తరిమికొట్టాలని సూచించారు. సర్నాల తిరుపతిరావు మీ వాడు, స్థానికుడు, మీ అందరిలో ఒకడు అని గడప గడపకు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాల్సిందిగా సూచించారు. మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు ప్రసంగించారు. నాయకులు జోగి రాము, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, మైలవరం సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, వైఎస్సార్ సీపీ మైలవరం మండల ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి,పట్టణ అధ్యక్షుడు పాల నారాయణరెడ్డి, నాగులూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి



పింఛన్ పంపిణీని పరిశీలిస్తున్న స్వామిదాసు

తిరువూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక 16వ వార్డులో శుక్రవారం మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే పెన్షన్లను వృద్ధులు, దివ్యాంగులు, వితంతుమహిళలకు పంపిణీ చేయిస్తున్న ప్రభుత్వం వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో లబ్ధిదారులు అండగా నిలవాలని కోరారు. వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాదరావు, పరసా సత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జి తిరుమలశెట్టి వేణుబాబు, నాయకులు గత్తం నాగేశ్వరరావు, మంచాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

శరవేగంగా పింఛన్ల పంపిణీ



నూజివీడులో పింఛన్ నగదును లబ్ధిదారులకు అందజేస్తున్న వలంటీరు



జూపూడిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్, గృహసారథులు

నూజివీడు: నూజివీడు పట్టణం, మండలంలో శుక్రవారం పింఛన్ల పంపిణీని వలంటీర్లు శరవేగంగా నిర్వహించారు. ప్రతినెలా ఒకటో తేదీన ఠంఛన్‌గా వలంటీర్లు ఉదయం 6గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను అందజేస్తున్నారు. నూజివీడు మండలంలో 88 శాతం, నూజివీడు పట్టణంలో 85 శాతం పింఛన్లను తొలిరోజే పంపిణీ చేశారు. మండలంలో 10,493 పింఛన్లు ఉండగా తొలిరోజు 9,065 పింఛన్లను పంపిణీ చేయగా, ఇంకా 1,428 పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. పట్టణంలో 5,336 పింఛన్లకు తొలిరోజు 4,617 పింఛన్లను అందజేయగా, ఇంకా 719 పింఛన్లను అందించాల్సి ఉంది. వేకువజామునే వచ్చి పింఛన్లను అందజేయడంతో వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పలు వృత్తిదారులు, వితంతువులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇబ్రహీంపట్నం: సామాజిక పింఛన్లను, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, గృహ సారథులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే పంపిణీ ప్రారంభించారు. మండలం పరిధిలో గ్రామాల్లో 4,919 మంది లబ్ధిదారులకు రూ.1,46,50,000 నగదు మంజూరు కాగా తొలిరోజు 2,967 మందికి రూ.87,71,500 నగదు అందజేశారు. మండలంలో 60.32 శాతం మందికి అందజేసినట్లు ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు. గుంటుపల్లిలో అత్యధికంగా 82.88 శాతం పంపిణీ చేయించిన పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావును అభినందించారు.

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో 88.3 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మంగాకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మొత్తం 8,673 మంది లబ్ధిదారులుండగా 5,928 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

ఆగిరిపల్లి: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం పండగలా సాగింది. ఆగిరిపల్లి మండలంలో 9,908 సామాజిక పెన్షన్లు ఉండగా మొదటిరోజు 6,900 మంది లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము అందజేశారు. ఆగిరిపల్లిలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుజన కుమారి లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు.

ముసునూరు: అర్హులైన పేదలందరికీ వైఎస్సార్ పింఛన్ కానుకల పథకం అధికంగా మేలు చేస్తుందని ఎంపీపీ కొండా దుర్గాభవాని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ వలంటీర్లు పింఛన్ల పంపిణీని శుక్రవారం తెల్లవారు జామునే ఆరంభించి, వేగంగా పూర్తి చేశారు. రమణక్కపేటలో నూతన వితంతు పింఛన్‌దారు దగ్గుమల్లి రమాదేవికి ఎంపీపీ దంపతులు పింఛన్ అందజేశారు. మండలంలో మొత్తం పింఛన్లు 8,083 కాగా, 67 శాతంతో 5,416 మందికి పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌తో నైపుణ్యాభివృద్ధి



లక్ష్య-2కే24 ప్రొసీడింగ్స్ విడుదల చేస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం

మైలవరం: పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేయడం వలన విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని జంషెడ్పూర్ హార్డ్‌వేర్ టెక్నాలజీస్ హెడ్ ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ సొగతసేన్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 17వ సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం లక్ష్య-2కే24 శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. సొగత సేన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరిగితే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కళాశాల హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉద్యోగావకాశాలకు అనుగుణంగా కావలసిన శక్తి సామర్థ్యాలు పెంపొందించుకోవాలన్నారు.

ఎల్‌బీఆర్‌సీటీ ట్రస్టీ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, మేకా శ్రీలత ప్రసంగించారు. సాంస్కృతిక విభాగంలో ఆయా అంశాలలో నిర్వహించిన పోటీలలో 260 మంది పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. మొత్తం 54 విభాగాలలో 2350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, కే తిమ్మారెడ్డి, డాక్టర్ వై.అమర్‌బాబు, డాక్టర్ జే వెంకటేశ్వరరావు, వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్యవివాహాల నిరోధంపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరువూరు: చదువుకునే వయస్సులో ఆడపిల్లలకు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, ఇందుకు తల్లిదండ్రులే శిక్షార్హులవుతారని ఐడియాస్ సేవాసంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి తెలిపారు. స్థానిక సర్వోదయ యూపీ స్కూలులో శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిరోధంపై విద్యార్థినుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు మాత్రమే పెళ్లి చేయాలని చట్టం సూచిస్తోందని, బాలికా విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున ప్రతి తల్లిదండ్రీ తమ పిల్లలను చదివించాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధానికి కృషి చేస్తామని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేశారు. బాల్యవివాహాల నిరోధంపై అవగాహనకు రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సర్వోదయ స్కూలు ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి, ఈవిద్యాలోక్ కోఆర్డినేటర్ కొంగల రవి, కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుప్తా పాల్గొన్నారు.

ఆర్డీవో బాధ్యతల స్వీకారం

నందిగామ: నందిగామ ఆర్డీవోగా ఎ.రవీంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పి.సాయిబాబు రాజమండ్రికి బదిలీకాగా, ఆ స్థానంలో రవీంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవో రవీంద్రరావును రెవెన్యూ శాఖతోపాటు ఆయా శాఖల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన డివిజన్ పరిధిలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని వారికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి



నూజివీడులో నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి విద్యార్థులు



తెల్లదేవరపల్లి ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

నూజివీడు: ఈనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ కమిషనర్ రొద్దం వెంకటరామిరెడ్డి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, చిన్నగాంధీ బొమ్మ సెంటర్ల మీదుగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పోలియో వ్యాధిని సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. బస్టాండుల్లో పోలియో బూత్‌లను ఏర్పాటు చేస్తున్నందున ప్రయాణాలు చేసే వారు తమ చిన్నారులకు అక్కడ పల్స్‌పోలియోచుక్కలు వేయించొచ్చన్నారు. మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరు: ఈ నెల 3న నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ వ్యాక్సిన్ వేయించాలని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి పూజిత కోరారు. చౌటపల్లి, రాజుగూడెం పీహెచ్‌సీలు, తిరువూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల పరిధిలో 41 కేంద్రాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కల మందు వేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 4,966 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు చుక్కల మందు వేయాలని గుర్తించినట్లు తెలిపారు. ప్రయాణికులకు అనువుగా తిరువూరు ఆర్టీసీ బస్టాండులో కూడా పల్స్ పోలియో కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఏ.కొండూరు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.స్వాతి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల మూడవ తేదీ నుంచి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 36 పోలింగ్ బూత్ కేంద్రాల్లో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేస్తారని రూట్ సూపర్వైజర్లు ఆరుగురు పర్యవేక్షిస్తారని తెలిపారు. నాలుగవ తేదీన మిగిలి ఉన్న పిల్లలకు ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు వయస్సున్న 3,207 మంది పిల్లలకు పోలి యో చుక్కలు వేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

విస్సన్నపేట: ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని డాక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల మూడో తేదీ పోలియో పల్స్ పోలియో నిర్వహణపై మండలంలోని తెల్లదేవరపల్లి ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆరోగ్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పల్స్ పోలియో చుక్కల లక్ష్యం 4,147 మందికి సంబందించి 46 బూత్‌లు, నాలుగు రూట్లు, ఒక మొబైల్ వ్యాన్ ద్వారా పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అశ్వనీ దత్తు, రజనీసుశీల పాల్గొన్నారు.

చాట్రాయి: మండంలోని అన్ని గ్రామాల్లో నెల 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమంపై అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి బూత్‌లో నిర్వహించే విధులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నాయకుల ఆత్మీయ సమావేశం

రెడ్డిగూడెం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మూడు గంటలకు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి వైఎస్సార్ సీపీ పెద్దలు రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని నాని, మైలవరం సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు. పాతనాగులూరు గ్రామం నుంచి రెడ్డిగూడెం పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

వ్యాపారిపై కేసు నమోదు

నందిగామ: నకిలీ బీడీలు విక్రయిస్తున్న వ్యాపారిపై పోలీసులు వ్యాపారిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..పట్టణానికి చెందిన చిరంజీవి అనే వ్యాపారి ఎస్ బీడీ పేరుతో నకిలీ బీడీలను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న కంపెనీ యజమానులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ హనీష్ తెలిపారు.

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్ల పంపిణీ



విద్యార్థినికి రైటింగ్ ప్యాడ్లు అందజేస్తున్న శ్రీలత, కోయ సుధ, శ్రీనివాస్, నాగిరెడ్డి

మైలవరం: స్థానిక నారాయణనగర్‌లోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్‌లో బాలికలకు 'భవిష్యత్తులో గిరిజన బాలికల విద్యపై ప్రాముఖ్యత, గిరిజన ప్రాంతంలో బాల్య వివాహాలు, ఆరోగ్యం'పై అవగాహన కార్యక్రమం మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రవాసాంధ్రులు, నార్త్, సౌత్ ఫౌండేషన్ లైజెస్, మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు గౌరవ సలహాదారు మేక శ్రీలత మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ అందజేశారు. స్థానిక 'భవిత సెంటర్‌లో దివ్యాంగులకు పండ్లు, జ్యూస్ అందజేశారు. ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ ప్రసంగించారు. టీమ్ లీడర్ ప్రొఫెసర్ శ్రీనివాస్, జి. నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, వార్డెన్ దీప, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీ


ఈనెల 31లోపు ఏక మొత్తంలో చెల్లించాలి

నూజివీడు: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిదారులు, ఆస్తుల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కలిగిస్తూ నిర్ణయం తీసుకుంది. బకాయిలను ఏక మొత్తంలో ఒకేసారి ఈనెల 31వ తేదీలోగా చెల్లిస్తే వడ్డీని మాఫీ చేస్తూ గతనెల 29న రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్-35 జారీ చేసింది. దీంతో ఆస్తి పన్ను బకాయిలున్న వారు, ఖాళీ స్థలాల యజమానులకు రూ.వేల లబ్ధి చేకూరనుంది. పన్నులను మున్సిపల్ కార్యాలయాల్లో, ఆన్‌లైన్, బ్యాంకింగ్, యూపీఐ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. ఈ నిర్ణయంతో కొన్నేళ్లుగా వసూలు కాని మొండి బకాయిలన్నీ వసూలయ్యే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రొద్దం వెంకట రామిరెడ్డి పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

దాళ్వా పంటల ఈక్రాప్ నమోదు పూర్తి

తిరువూరు: దాళ్వా సీజన్లో మండలంలో వేసిన వివిధ పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తయినట్లు తిరువూరు మండల వ్యవసాయాధికారిణి పద్మ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల మూడవ తేదీ వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. జాబితాల్లో ఏవైనా తప్పులుంటే తెలియజేయాలని సూచించారు. తుది జాబితా ప్రదర్శన తర్వాత మార్పులు చేయడం సాధ్యపడదన్నారు.

అమరవీరుల స్ఫూర్తిగా పోరాటం



తిరువూరు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమంలో అశువులు బాసిన అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా పోరాడతామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ మారబత్తుల గోపాల్ అన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని స్థానిక బోస్ సెంటర్లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 30 సంవత్సరాలుగా సాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఫలించే వరకు కొనసాగుతుందన్నారు. సమితి నాయకులు మల్లేశ్వరరావు, ప్రసన్నకుమార్, రంజిత్, టైటస్, విమలారావు, అశోక్, డేవిడ్ పాల్గొన్నారు.